అభివృద్ధి పథంలో మోటకొండూరు

మోటకొండూర్‌లో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీలత

సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత

మోటకొండూర్, జూలై 3 : మోటకొండూర్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, పాలకవర్గ సభ్యుల సహకారంతో మోటకొండూర్ గ్రామ పంచాయతీ నిజాయితీకి మారుపేరుగా నిలుస్తుందని సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులతో కలిసి విలేకరుల సమవేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో మాజీ ఉప సర్పంచ్ రేగు శ్రీనివాస్‌తోపాటు పలువురు వార్డు సభ్యులు తమపై మోపిన అభియోగాల్లో నిజం లేదని జిల్లా పంచాయతీ అధికారి సునంద వెల్లడించినట్లు తెలిపారు. ఇది తమ నిజాయితీకి నిదర్శనమన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, అభివృద్ధిని జీర్ణించుకోలేక కొందరు అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు సొంత నిధులతో తాగునీరు, స్వర్గపురి రథం, చెత్తబండిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. రాజకీయలకు అతీతంగా గ్రామ పంచాయతీ నిధులతోపాటు సొంత డబ్బుతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుగ్గ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు కాంబోజు నాగరాజు, మోకాళ్ల కవిత, సత్తెమ్మ, బీరకాయల మల్లేశ్, జంగవెల్లి జహంగీర్ పాల్గొన్నారు.

కరాటేలో ఆత్మకూరు(ఎం)విద్యార్థుల ప్రతిభ

కరాటేలో బ్లాక్‌బెల్ట్‌లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

ఆత్మకూరు(ఎం), జూలై 3 : విక్టరీ చోటో కాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నేషనల్ బ్లాక్‌బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. టెస్ట్‌లో పాల్గొన్న మండల కేంద్రానికి చెందిన చెరుకు సాత్విక్, కామునిగూడేనికి చెందిన మాధ భరత్ గౌడ్, రాయిపల్లికి చెందిన జట్ట ఆరాధ్య, కప్పె శ్రీజ బ్లాక్‌బెల్ట్‌లు సాధించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఫౌండర్ మల్లికార్జున్‌గౌడ్, చైర్మన్ సదాశివుడు, మాస్టర్ వెంకట్‌తోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోటకొండూర్ కురుమ సంఘం అధ్యక్షుడిగా సిద్ధులు

మోటకొండూర్, జూలై 3 : మోటకొండూర్ గ్రామ కురుమ సంఘం నూతన కమిటీని సోమవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాల్ద సిద్ధులు, ఉపాధ్యక్షులుగా భూమండ్ల అశోక్, దడిగె సిద్ధులు, ప్రధాన కార్యదర్శిగా బాల్ద వెంకటేశ్, కోశాధికారిగా బుగ్గ సత్తయ్య, కార్యవర్గ సభ్యులుగా బచ్చ శ్రీశైలం, బాల్ద ఐలయ్య, నారి శ్రీశైలం, బుగ్గ సిద్ధులు, రేగు బాలరాజు, పరశురాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సర్కారు పాఠశాలల విద్యార్థులకు త్రిబుల్ ఐటీలో సీట్లు

శ్రీచందన

రాజాపేట, జూలై 3 : మండలంలోని రఘునాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మచ్చ శ్రీచందన బాసర త్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోధ్యాయుడు గాయం బాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. శ్రీచందనకు సర్పంచ్ శ్రవణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆలేరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జూకంటి ప్రణదీప్ బాసర త్రిబుల్ ఐటీలో సీటు పొందినట్లు పాఠశాల హెచ్ఎం సూరేపల్లి నారాయణ, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేశ్ తెలిపారు. ప్రణదీప్‌ను ఎస్ఎంసీ చైర్మన్ సీస గోవర్ధన్, ఉపాధ్యాయులు అభినందించారు.

పాల సంఘాలకు చైర్మన్ల ఎన్నిక

పెంటపర్తి రాజిరెడ్డి (కుర్రారం చైర్మన్)

రాజాపేట, జూలై 3 : మండలంలోని కుర్రారం పాల సొసైటీ చైర్మన్‌గా పెంటపర్తి రాజిరెడ్డిని, డైరెక్టర్లుగా ప్రభాకర్, సోమలింగం ఎన్నికయ్యారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కొరటికల్ పాల సంఘం చైర్మన్‌గా భావనా రుషి, డైరెక్టర్లుగా సుధాలక్ష్మి, యాదయ్య, ఎల్లారెడ్డి, మంగారెడ్డి, మల్లయ్య, కైలాసం, ముత్యాలు, ఎల్లమ్మ, శంకరయ్యను ఎన్నుకున్నారు.

ట్రాఫిక్ సీఐ శివశంకర్ బదిలీ

యాదగిరిగుట్ట, జూలై 3 : యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ శివశంకర్ గౌడ్ మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయారు. ఆయనతోపాటు సైబర్ క్రైమ్‌లో విధులు నిర్వహించే ఎస్ఐ యాదగిరి సరూర్‌నగర్‌కు బదిలీపై వెళ్లనున్నారు.ఈ మేరకు రాచకొండ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పాత్రికేయులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చౌటుప్పల్ : మార్కండేయ స్వామి ఆలయంలో వ్రతం చేస్తున్న భక్తులు

రాజాపేట : పూలతో అలంకరించిన రమా సహిత సత్యనారాయణ స్వామి

భువనగిరి కలెక్టరేట్ : నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో భక్తులకు ఆశీర్వాదం అందజేస్తున్న సిద్ధగురు రమణానంద మహర్షి

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో సామూహిక వ్రతాలు, అభిషేకాలు, గణపతి పూజ, రుద్రాభిషేకం, పుష్పాలంకరణ, యజ్ఞం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పలు ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

– నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్, జూలై 3

ఆత్మకూరు(ఎం)లోని సాయిబాబా దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి : దేశ్‌ముఖిలోని సాయి బృందావనంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నారాయణ స్వామిజీ, భక్తులు

మిషన్ కాకతీయతో చెరువులు పటిష్టం

- కోట్లాది రూపాయలతో పునరుద్ధరణ
- గుండాల మండల వ్యాప్తంగా 63 చెరువులు..
- నాలుగు విడుతలుగా చేపట్టిన పనులతో పెరిగిన భూగర్భ జలాలు, సాగు విస్తీర్ణం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

నిండుకుండను తలపిస్తున్న అంబాల గ్రామంలోని తాళ్లచెరువు

గుండాల, జూలై 3 : వ్యవసాయానికి మూలాధారం చెరువులేనని తెలిసినా సమైక్య పాలనలో వాటిని అభివృద్ధి చేసిన పాపాన పోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో మిషన్ కాకతీయ పథకాన్ని చేపట్టారు. ఈ పథకం కింద గుండాల మండలంలోని చెరువులన్నీ పటిష్టమయ్యాయి. మండలంలోని 63 చెరువులు, కుంటల కట్టల పునరుద్ధరణ, పూడికతీత పనులు, కత్వలు, తూములు నిర్మించారు. మొత్తం నాలుగు విడుతల్లో పనులు చేపట్టగా.. మొదటి విడుతలో 17 చెరువులు, కుంటలు, రెండో విడుతలో 23, మూడో విడుతలో 11, నాలుగో విడుతలో 12 చెరువులు, కుంటల పనులు పూర్తయ్యాయి.

పెరిగిన నీటి నిల్వ సామర్థ్యం, సాగు విస్తీర్ణం..

కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి చెరువులో పూడికతీయడంతో చెరువుల లోతు పెరిగింది. తద్వారా నీటి నిల్వ సామర్థ్యంతోపాటు భూగర్భజలాలు పెరిగి సాగు విస్తీర్ణం సైతం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం మొదటి విడుత కింద పనులు చేపట్టిన చెరువుల కింద, 1667ఎకరాలు, రెండో విడుత 1144 ఎకరాలు, మూడో విడుత 645 ఎకరాలు, నాలుగో విడుత చెరువుల కింద 473 ఎకరాలు సాగవుతున్నది. మిషన్ కాకతీయ పథకం వ్యవసాయానికి ఆయువుపట్టుగా మారిందని, మిషన్ కాకతీయ పనులతో సాగు విస్తీర్ణం పెరిగిందని, సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే ఇది సాధ్యమైందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల కట్టలు ధృడంగా మారాయి.

మండలంలోని 63 చెరువులు, కుంటల్లో మిషన్ కాకతీయ పనులు పూర్తయ్యాయి. అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలను నాలుగు భాగాలుగా విభజించి పనులు పూర్తిచేయించాం. చెరువుల కట్టలను ధృడంగా చేశాం. చెరువుల్లో పూడికతీయించాం. అలుగులు, తూములను నిర్మించాం. నాలుగో విడుతలో చేపట్టిన పనుల్లో చిన్న చిన్న పనులు మినహా దాదాపు పూర్తయ్యాయి. ఈ పథకంతో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. బోర్లు, బావుల నుంచి సాగుకు పుష్కలంగా నీళ్లు అందుతున్నాయి.

–పరమేశ్వర్, ఇరిగేషన్ ఏఈ, గుండాల

యువకుడి ఆత్మహత్య

చిట్యాల, జూలై 3: ప్రేమించిన యువతి మరొకరిని వివాహం చేసుకుందని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం టోలీ పోస్టు బెండల్ తంగ్రా గ్రామానికి చెందిన సరోజ్ ఆర్‌సన్ వెలిమినేడు శివారులోని దశమి ల్యాబ్స్‌లో పనిచేస్తున్నాడు. ఈయన ప్రేమించిన యువతి మరొకరిని వివాహం చేసుకుందనే కారణంతో ఈ నెల 2న రాత్రి దశమి ల్యాబ్స్ సమీపంలో చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. సోమవారం ఉదయం కంపెనీలోని కార్మికులు ఆర్‌సన్ ఉరేసుకున్న విషయాన్ని తెలపడంతో కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

నోటు పుస్తకాల పంపిణీ

తుర్కపల్లి, జూలై 3 : మండలంలోని పల్లెపహాడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం జై భీమ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మందాల స్వామి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీణ, ఉప సర్పంచ్ లక్ష్మి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భిక్షపతి, కోశాధికారి దేవదానం పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జైభీమ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వామి